క్లుప్తంగా

'బీజేపీ గెలిస్తేనే అభివృద్ధి'



ఖానాపురం : కేంద్రంలో బీజేపీ గెలిస్తేనే దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తాయని ఆ పార్టీ మహబూబాబాద్ నియోజకవర్గ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ సతీమణి శారద, కూతురు పల్లవి స్పష్టం చేశారు. మండలంలోని ధర్మారావుపేట, తదితర గ్రామాల్లో వారు గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా శారద, పల్లవి ప్రజలతో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశం గర్వించేలా పరిపాలన అందిస్తున్నాడని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల మోసపూరిత ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జల్లి మధు, నాయకులు లింగబత్తుల యాకసాయన్న, యాదగిరిరావు, కుమారస్వామి, రవి, యాకస్వామి, హరీశ్, హనుమనాయక్, లచ్చునాయక్ పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీగా అరూరి రమేశ్‌ను గెలిపించండి



సంగెం : వరంగల్ ఎంపీగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అరూరి రమేశ్‌ను గెలిపించి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ కోరారు. మండలంలోని నార్లవాయిలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. కూలీలకు నామూనా ఈవీఎం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రాజమౌళి, మొలుగూరి వెంకటేశ్వర్లు, మొగిలి , సింగిరెడ్డి రాజు, పరికి స్వామి, దామెరుప్పుల వీరస్వామి పాల్గొన్నారు.

పరామర్శ



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో ప్రమాదవశాత్తు మొక్కజొన్న చొప్ప మంటల్లో చిక్కుకుని కాలిపోయిన రైతు అల్లంనేని పాపారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం సాయంత్రం పరామర్శించారు. తొలుత ఆయన ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, నాయకులు బద్దునాయక్ పాల్గొన్నారు.

ఆప్తుడిని కోల్పోయా : ప్రొ.కంచ ఐలయ్య

చెన్నారావుపేట : ఆప్తుడిని కోల్పోయానని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తు మొక్కజొన్న చొప్ప అంటుకుని తన మిత్రుడు అల్లంనేని పాపారావు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. పాపారావు, తన సోదరుడు కట్టయ్య కలిసి ఆరో తరగతి వరకు గూడూరులో, 10వ తరగతి వరకు నర్సంపేట హైస్కూల్‌లో 10 తరగతి వరకు కలిసి చదువుకున్నామని తెలిపారు. అంత్యక్రియల్లో పాల్గొంటానని వెల్లడించారు.

'ప్రాధాన్యం లేకపోవడంతో పార్టీ మారుతున్నా..'

దామెర : పార్టీ కోసం కష్టపడి పనిచేసినా తగిన ప్రాధాన్యత లేకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రధాన అనుచరుడు, బిల్లా రమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆన మాట్లాడారు. తన తల్లి బిల్లా సరోజినీదేవి ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. తల్లి స్ఫూర్తితో ప్రజాసేవచేయాలని రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకుండా రైతుబంధు పదవీ ఇచ్చి చల్లా ధర్మారెడ్డి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అనిల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, దుర్శెట్టి భిక్షపతి, మొద్దు ప్రవీణ్, అర్ధం రాజు, దామెర రతన్, తదితరులు పాల్గొన్నారు.

అరూరిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

వరంగల్ : వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్‌పై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు సోషల్ మీడియా గ్రూపుల్లో చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని వరంగల్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ అల్లం నాగరాజు అన్నారు. దేశాయిపేటలోని తూర్పు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య వీడియోలపైన పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఉపాధి' ఉత్తదే!

131 కుటుంబాలకే వంద రోజుల పని

- పనులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- వలస బాటలో కూలీలు

నల్లబెల్లి : ఉపాధి హామీ పథకం ఉత్తదే అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేవలం 131 కుటుంబాలకు మాత్రమే వంద రోజులపాటు పని కల్పించారు. పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కూలీలు వలస బాట పట్టక తప్పడం లేదు. మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో 4120 జాబ్ కార్డులు ఉండగా 6418 మంది కూలీలు పని చేయగా మొత్తం పని దినాలు లక్షా 55 వేల 544 కల్పించినట్టు, కూలీలకు చెల్లించిన వేతనం మొత్తం రూ.2.36 కోట్లు కాగా సగటు కూలి రూ.164 నమోదు అయ్యినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలో మండలం 7వ స్థానంలో నిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్న అపవాదు ఉంది.

వంద రోజుల పనికి నోచుకోని 3 వేల 989 కుటుంబాలు

జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరికి చట్ట ప్రకారం వంద రోజుల పని కల్పించి సకాలంలో వేతనాలు అందించాలి. కాగా మండలంలో పనులు చేసిన కూలీలకు సగటు వేతనం రూ.164 మాత్రమే దక్కింది. మొత్తం 4120 కుటుంబాలకు చెందిన కూలీలకు 100 రోజుల పని కల్పించాల్సి ఉండగా 3989 కుటుంబాలు వంద రోజుల ఉపాధికి నోచుకోలేదు. గతేడాది రికార్డులను దృష్టిలో పెట్టుకుని అధికారులు 2024–25లో పెద్ద మొత్తంలో కూలీలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అంచనాలు రూపొందించినా ఈ ఏడాదైనా లక్ష్యం నెరవేరుతుందా అన్న సందేహం కూలీల మెదళ్లను తొలుస్తోంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాం



గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ వంద రోజుల ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాం. ఈ ఏడాదిలో ఇప్పటికే 78 వేల పని దినాలు కల్పించాం. ఉపాధి హామీ సిబ్బందిని సమన్వయం చేస్తూ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవు.

–నర్సింహారెడ్డి, ఎంపీడీఓ, నల్లబెల్లి

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి



వర్ధన్నపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



పర్వతగిరి : ప్రచారం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని ఎంపీపీ అప్పారావు, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్ తోటకూరి రాజమణి కోరారు. పట్టణంలో, దమ్మన్నపేటలో గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించడంతో ఆర్నెళ్ల పాలనలోనే ప్రజలు విసుగు చెందారని చెప్పారు. ప్రస్తుతం రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పదేళ్ల పాలనలో కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చుతూ బడుగులను విస్మరించిందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మెజారిటీ సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కంజర్ల రవికుమార్, రఫీక్, తోటకూరి శ్రీధర్, గద్దం సంతోశ్, మర్రిపుడగల ప్రసాద్, మెరుగు రాజేశ్, ఎలికట్టె యాకయ్య, ఈరెల్లి యాకమ్మ, పడిశాల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ, చౌటపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కరిమిళ్ల దుర్గారావు మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పట్టపురం వెంకట్‌రాజు, నాయకులు తక్కళ్లపల్లి సంపత్‌రావు, దాడి సదానందం, కోదాటి దేవేందర్‌రావు, దాడి వినయ్, జుట్టుకొండ పెద్దనర్సయ్య, చిన్ననర్సయ్య, పంతంగి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ కోసం పోరాడిన పార్టీగా, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన బీఆర్‌ఎస్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, నాయకులు పొన్నం మొగిలి, సుకినె రాజేశ్వర్‌రావు, శానబోయిన రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట, తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత గెలిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, నాయకులు రమేశ్, పైండ్ల యాదగిరి, రాజు, సతీశ్, లింగ్యానాయక్, శ్రీను, వెంకన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : మర్రిపల్లిలో ప్రచారం చేస్తున్న శ్రేణులు



ఖానాపురం : ప్రచారం చేస్తున్న నాయకులు

పల్లెల్లో ఎన్నికల ప్రచార జోరు



కాట్రపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



రాయపర్తిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి : మండలంలోని రాయపర్తి, కాట్రపల్లి, తదితర గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ప్రచార జోరు గురువారం కొనసాగింది. అయా పార్టీల నాయకులు ప్రజలను కలుస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికే ఓటేయాలని కోరారు. ఇతర పార్టీలను విమర్శిస్తూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మేలు జరుగుతుందని తెలిపారు. ప్రచారంలో రాజకీయ పార్టీల నాయకులు అశ్రఫ్ పాషా, కత్తి సోమన్న, గుమ్మడిరాజుల శ్రీనివాస్, మొర్రి రాజేందర్, యాకయ్య పాల్గొన్నారు.

నూరుశాతం ఓటింగ్ కీలకం



అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్, తదితరులు

నర్సంపేట : ప్రజాస్వామ్య పరిరక్షణలో నూరుశాతం ఓటింగ్ కీలకమని స్వచ్ఛంద సంస్థల సమాఖ్య సంఘాల బాధ్యుడు, ఏఎస్ఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ స్పష్టం చేశారు. వినియోగదారులు, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్‌లో, అంబేడ్కర్ సెంటర్ వద్ద గురువారం నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. అర్హులందరూ సుపరిపాలన అందించగల నాయకుడిని ఎంచుకుని తప్పకుండా ఓటేయాలని చెప్పారు. ప్రతిభ స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు బెజ్జంకి ప్రభాకర్, యువజన సంఘం నాయకుడు ఆబోతు రాజుయాదవ్, ఆజాద్ యూత్ క్లబ్ అధ్యక్షుడు పాక ప్రవీణ్, పైండ్ల గగన్, నాగెల్లి సారంగం, కాసుల వెంకటాచారి, రాముసేవక్ మాట్లాడారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ప్రలోభాలకు లొంగకుండా అర్హులందరూ ఓటేయాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటును సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు.

కమ్యూనిస్టు నర్సింహారెడ్డి యువతకు ఆదర్శం

దుగ్గొండి : తుది శ్వాస ఉన్నంత వరకు కమ్యూనిస్టుగా జీవించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి యువతకు ఆదర్శమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు తెలిపారు. మండలంలోని రేబల్లెలో నర్సింహారెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. నర్సింహారెడ్డి చిత్రపటానికి బాబురావు, నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాబురావు మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను ఏకం చేసి తెలంగాణ సాయుధ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో నర్సింహారెడ్డి కీలకపాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్, నాయకులు మహ్మద్ హుస్సేన్, లాల్ మహ్మద్, పేరబోయిన చేరాలు, ఐలోని, చందర్‌రావు, మేర్గు సుధాకర్, గటిక మొగిలి, మహ్మద్ యాకూబ్, లాసాని బాబురావు, భాస్కర్ పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీకి గుణపాఠం తప్పదు'



నర్సంపేట : పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి గుణపాఠం చెప్పక తప్పదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు గోవర్ధన్, ఆ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. మురళీకృష్ణకు ఓటేసి గెలిపించాలని కోరుతూ నర్సంపేటలోని పాఖాల సెంటర్, అంబేద్కర్ సెంటర్, అంగర్‌సెంటర్, ద్వారకపేట సెంటర్ వరకు గురువారం నిర్వహించిన రోడ్ షోలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు మాట్లాడారు. మతోన్మాద బీజేపీ పదేళ్ల పాలనలో రైతు, కార్మిక ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచి పెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు సైతం దోపిడీ వర్గాల కొమ్ము కాసేవేనని తెలిపారు. విప్లవ పార్టీల అభ్యర్థిగా బరిలో నిలిచిన మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, వెంకటస్వామి, మల్లన్న, భద్రాజీ, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'కే విద్యార్థి సంఘాల మద్దతు



నర్సంపేట రూరల్ : ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన పోరిక బలరాంనాయక్‌కు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు అల్వాల నరేశ్, బొట్ల నరేశ్, ప్రమోద్, సాగర్ మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కుతూ విదేశీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను బీజేపీ కాపాడుతోందని విమర్శించారు. విద్య, వైద్య సేవలు కుప్పకూలాయని ఆందోళన వెలిబుచ్చారు. నూతన విద్యా విధానం ముసుగులో విద్యా రంగాన్ని ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని తెలిపారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే దిశగా కేంద్రంలోని బీజేపీని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, రఘు, ప్రమోద్, రాజేశ్, రామకృష్ణ, మురళి, మోహన్ బాబు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయం వార్షికోత్సవాలు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పంచమ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పునరుద్ధీకరణ, దేవాలయం చుట్టూ దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన జరిగి ఐదు సంవత్సరాలు పూర్తయినందున మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ విశేష పూజలు, చివరి రోజున విగ్రహ మూర్తులకు అభిషేకాలు, మహాహారతి తీర్థప్రసాద వితరణ ఉంటుందని వెల్లడించారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ



చెన్నారావుపేట : కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మాధవరెడ్డి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : రాష్ట్రంలో ఆగస్టు 15లోపు రైతులు రుణమాఫీ చేస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని బాపునగర్, తోపనగడ్డ తండాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, వాయిల్‌తండా నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్లు సిద్ధన రమేశ్, తప్పెట రమేశ్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, ఉన్నారు.

కొండాయిల్‌పల్లి, గుంటూరుపల్లిలో చేరిక

నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లి, గుంటూరుపల్లిలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాధవరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ కొండాయిల్‌పల్లి అధ్యక్షుడు ఎరుకల నరేశ్‌రెడ్డి, ప్రధాన పెంతల నాగరాజు ఆధ్వర్యంలో పెంతల కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, ఎద్దు శ్రీను, అంజి, సదయ్య, బీరెడ్డి ఇన్నాషమ్మ, అగస్టీన్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మంద లక్ష్మణ్‌రెడ్డి, కొనుకటి ప్రతాప్, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే అభివృద్ధి

నెక్కొండ : ఇండియా కూటమితోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తోపనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ మహ్మద్ పకీర్‌మియా, రైతు బంధు సమితి గ్రామ అధ్యక్షుడు అంబటి వీరారెడ్డి, కృష్ణ, సంపత్, రమేష్, మొగిలి, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సతీష్, ఐలయ్య, రవి కుమార్ దొంతి సమక్ష్యంలో కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నాయకులు చల్లా శ్రీపాల్ రెడ్డి, కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ వస్తే అధోగతే



నర్సంపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



చెన్నారావుపేట : అక్కల్‌చెడలో..



ఖానాపురం : కొత్తూరులో..

- టీపీసీసీ సభ్యుడు రామానంద్

నర్సంపేట : కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని 5, 6, 7, 8, 10, 11, 18, 19వ వార్డుల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడారు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భవిష్యత్తు ఉండదని చెప్పారు. దళితులు, గిరిజనులు, బీసీలకు రాజ్యాంగా ద్వారా దక్కాల్సిన హక్కులు కోల్పోతారని తెలిపారు. మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, పట్టణ ఉపాధ్యక్షులు కాట రఘు, పంబి వంశీకృష్ణ, జూలపెల్లి రాజేశ్వర్‌రావు, పట్టణ కార్యదర్శి మోటం రవికుమార్, నాడెం నాగేశ్వర్, చింతల క్రాంతిరెడ్డి, పట్టణ ప్రచార కార్యదర్శి కొల్లూరి మధుకర్ తదితరలు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ, కోనాపురం, లింగాపురం, తదితర గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో తాజా మాజీ సర్పంచ్ తూటి పావని రమేశ్ మాట్లాడారు. ఎంపీగా పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. చేతి గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీని అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోతు వీరన్న, నాయకులు ముత్యం భద్రయ్య, సురేశ్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, మాజీ వార్డు సభ్యుడు రాజునాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రగతికి పునాది



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

పర్వతగిరి : కాంగ్రెస్ పాలనలోనే దేశ ప్రగతికి పునాది పడుతుందని ఏఐసీసీ కోఆర్డినేటర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటస్వామి తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంకి వచ్చాక దేశంలో, రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటస్వామి మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నల్లధనాన్ని వెలికితీస్తామని, రైతులకు ఎంఎస్‌పీ ఇస్తామని, తదితర అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని గద్దెనెక్కి, పదేళ్లపాటు మోసపూరిత పాలన సాగించిందని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో నిధుల దుర్వినియోగం చేసిందని దుయ్యబట్టారు. అవినీతి డబ్బుతో అక్రమ వ్యాపారాలు, అరాచక పాలనతో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేశారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ వరంగల్ లోక్‌సభ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కోఆరినేటర్ బండారి జనార్ధన్, రంజిత్, శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, నాయకులు బి.మహేంద్ర, రాంచందర్, భానోతు భాస్కర్, సునీల్‌రావు, గంగాధర్‌రావు, మహ్మద్ అలీ, వెంకటేశ్వర్లు, సుధాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శిక్షణ శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్‌లోని శ్రీకార్యసిద్ధి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బాల సంస్కార్ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ మఠం–హైదరాబాద్ నేతృత్వంలో హనుమాన్ సేవా సమితి సహకారంతో ఈనెల 15 నుంచి 21వరకు వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు దేవులపెల్లి దయాకర్ తెలిపారు. ఆ ఆలయ ప్రాంగణంలో కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 4 నుంచి 10వ తరగతి బాలలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, నీతి పద్యాలు, ఏకాగ్రత రహస్యములు, సమయపాలన, దేశభక్తి, భారతీ వారసత్వ వైభవం, మాతృ పితృ భక్తి గురు పరంపర, భజనలు, ఆచారాలు, సంప్రదాయాలు, గుణాత్మకమైన ఆటలు, చిత్రలేఖనం, రామాయణ మహాభారతాది ఇతిహాసాల నుంచి కథా దర్శనంపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు వచ్చే పిల్లలకు రోజు అల్పాహారం, నిమ్మరం, మజ్జిగ అందిస్తామని పేర్కొన్నారు.

నైతిక విలువలతోనే విద్యార్థుల ఉన్నతి

సంగెం : నైతిక విలువలతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని ప్రముఖ సైకాలజిస్టు గుండేటి శ్రీకాంత్ తెలిపారు. మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నైతిక విలువలు పెంచేలా విద్యాబోధన అందిస్తేనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని తెలిపారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మేరకు సూచనలు, సలహాలు అందిస్తూ సన్మార్గంలో నడిచేలా చూడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. ఆత్మగౌరవం, క్రమశిక్షణతో మసలుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు, కరుణశ్రీ, కిషన్‌కుమార్, సునీత, తదితరులు పాల్గొన్నారు.